క్లుప్తంగా

డిగ్రీ కాలేజీ అధ్యాపకుడికి డాక్టరేట్


పీరకుమార్

వెంకటాచలం: ఎస్‌ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న పీరకుమార్‌కు విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) డాక్టరేట్ ప్రదానం చేసింది. సీనియర్ ప్రొఫెసర్ ఎస్‌ఆర్‌వీ రమణారెడ్డి పర్యవేక్షణలో ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పంటలపై పరిశోధన చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న అధికారులు, నాయకులు

కొడవలూరు: కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం కోరారు. మండలంలోని రామన్నపాళెంలో వికసిత భారత్ సంకల్ప యాత్రను బుధవారం నిర్వహించారు. సంకల్ప యాత్ర జిల్లా కన్వీనర్ ముక్కు రాధాకృష్ణ గౌడ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రూ.13 వేల కోట్లతో విశ్వకర్మ యోజన కార్యక్రమం అమలవుతోందని తెలిపారు. దీని ద్వారా 15 రోజులపాటు శిక్షణ ఇచ్చి 18 రకాల చేతి వృత్తులకు తొలి విడతగా రూ.లక్ష, రెండో విడతగా రూ.2 లక్షల వంతున ష్యూరిటీ లేని రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం డ్రోన్‌ల ద్వారా పొలాల్లో మందుల పిచికారీని ప్రయోగాత్మకంగా చేసి చూపారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.వసంతకుమారి, ఏపీఎం ఎస్.రుక్మిణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకి శ్రీనివాసులు, పి.సాయిమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, బీజేపీ నాయకులు రాఘవేంద్రరావు, మురళీకృష్ణ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శేషారెడ్డి మృతి



ముత్తుకూరు: మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వేణుంబాక శేషారెడ్డి (72) మృతి చెందారు. తాళ్లపూడి గ్రామానికి చెందిన రాజ్యసభసభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డికి ఈయన బంధువు. కాగా శేషారెడ్డి కొంతకాలంగా గుండె సంబంధ సమస్యతో బాధపడుతున్నారు. సోమవారం సాయంత్రం నెల్లూరులోని స్వగృహంలో కుప్పకూలిపోయి మృతిచెందారు. అమెరికా నుంచి ఆయన కుమార్తె బుధవారం వచ్చారు. దీంతో గురువారం అంత్యక్రియలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వేణుంబాక శేషారెడ్డి మృతి పట్ల సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి సంతాపం తెలిపారు.

వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న వాణి

నెల్లూరు రూరల్: సీనియర్ సిటిజన్లపై కుటుంబసభ్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వాణి అన్నారు. పొదలకూరు రోడ్డులోని హరిత వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. సీనియర్ సిటిజన్ల సమస్యలను తెలుసుకున్న అనంతరం ఆమె మాట్లాడారు. సీనియర్ సిటిజన్లకు ఉచిత న్యాయసేవలను అందిస్తున్నామని చెప్పారు. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

కనులపండువగా ప్రాకారోత్సవం



నెల్లూరు(బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ప్రాకారోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా దేవిశెట్టి వెంకటసుబ్బయ్య, కుమారులు వ్యవహరించారు. ఈఓ ఆరంబాకం వేణుగోపాల్ పర్యవేక్షించారు.

వేగంగా స్పందన పనులు

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో యంత్రాంగం స్పందించి పనులు చేపట్టింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. మరోవైపు పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికి భోజనం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

- యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు
- ఇతర జిల్లాల నుంచి సహాయక బృందాల రాక
- నిన్న సాయంత్రానికే చాలా గ్రామాలకు విద్యుత్ సరఫరా
- పునరావాస కేంద్రాల్లో భోజనం పంపిణీ
- పర్యవేక్షించిన ప్రజాప్రతినిధులు


పొదలకూరు: ఊసపల్లి - మొగళ్లూరు మార్గంలో చెట్ల తొలగింపు

పొదలకూరు: గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా చెట్లు విద్యుత్ తీగలపై విరిగిపడి స్తంభాలు కూలిపోయాయి. ఫలితంగా అనేక ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు, సిబ్బంది కలిసి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈదురుగాలులు, వర్షం కారణంగా చాలాచోట్ల స్తంభాలు నేలవాలాయి. ఫలితంగా సమస్య ఎక్కడ ఉందో తెలుసుకునేందుకే అధికారులు, సిబ్బందికి సమయం పట్టింది.

పనులిలా..

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాలతో విద్యుత్ ఉన్నత స్థాయి అధికారులు ఇతర జిల్లాల నుంచి సహాయ బృందాలను పిలిపించి పనులు చేయించారు. అనంతపురం జిల్లా నుంచి ప్రత్యేకంగా కూలీలను రప్పించారు. మంగళవారం నాటికే మరుపూరు, తోడేరు తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా చేశారు. బుధవారం సాయంత్రం నావూరు, చెన్నారెడ్డిపల్లి, నావూరుపల్లి తదితర గ్రామాల్లో పనులు పూర్తి చేశారు. కాగా విద్యుత్ లేని కారణంగా గ్రామాల్లో మంచినీటికి ఇబ్బందులు తలెత్తడంతో మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులకు తగిన ఆదేశాలిచ్చి ప్రతిక్షణం పర్యవేక్షిస్తూ యుద్ధప్రాతిపదికన పనులు చేయించారు. మంగళవారం రాత్రి నెల్లూరు నగరానికి మండలంలోని మహ్మదాపురం నుంచి మంచినీటిని సరఫరా చేసే ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఏడీఈ సురేంద్రబాబు తన సిబ్బందితో కలిసి పునరుద్ధరించారు.

కూలిన చెట్ల తొలగింపు

తుఫాన్ ప్రభావంతో రోడ్ల వెంబడి వందల సంఖ్యలో చెట్లు కూలిపోయాయి. వీటి దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బుధవారం కూడా చెట్ల తొలగింపు పనులను చేపట్టారు. ఊసపల్లి - మొగళ్లూరు మార్గంలో పదుల సంఖ్యలో చెట్లు కూలిపోవడంతో ఊసపల్లి గ్రామస్తులు వావింటపర్తి మీదుగా పొదలకూరుకు వస్తున్నారు. దీంతో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మాల్యాద్రి చెట్లు తొలగింపు పనులు చేయించారు. రాపూరు మార్గం ఇనుకుర్తి, ముదిగేడు వద్ద పనులను గ్రామ సర్పంచ్ పెదమల్లు శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ సెక్రటరీ రత్తయ్య పర్యవేక్షించారు. ఊసపల్లి ప్రాథమిక పాఠశాల భవనంపై చెట్టు కూలింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

గిరిజనులకు నిత్యావసరాలు

కొడవలూరు: మండలంలోని తాటాకులదిన్నె, నార్తు రాజుపాళెం పాఠశాలల్లో ఆదివారం నుంచి రెవెన్యూ శాఖ అధికారులు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. నార్తురాజుపాళెంలో 50, తాటాకులదిన్నెలో 32 గిరిజన కుటుంబాలకు ఆశ్రయం కల్పించి భోజన వసతి సమకూర్చారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆయా 82 కుటుంబాల గిరిజనులకు 25 కిలోల చొప్పున బియ్యం, కిలో నూనె, కిలో కందిపప్పు, కిలో ఎర్రగడ్డలు, కిలో ఉర్లగడ్డలను నార్తురాజుపాళెం సర్పంచ్ బి.సుప్రియ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి భోజన వసతి కల్పించిందన్నారు. తిరిగి సురక్షితంగా ఇళ్లకు వెళ్లేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీటీ గున్నం మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.జనార్దనరెడ్డి, ఆర్‌ఐ సునీల్, వీఆర్వోలు మల్లికార్జున, ప్రియదర్శిని పాల్గొన్నారు.

అనికేపల్లిలో..

వెంకటాచలం: మండలంలోని అనికేపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న 400 గిరిజన కుటుంబాలకు 10 కేజీల చొప్పున బియ్యంను మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. తుఫాన్ కారణంగా గిరిజన కుటుంబాలు పనులకు వెళ్లలేక ఇళ్ల వద్దే ఉంటున్నాయి. దీంతో ప్రదీప్‌కుమార్‌రెడ్డి తన సొంత నిధులు వెచ్చించి వారికి అండగా నిలిచారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమరిగిరి శీనమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తేరుకుంటున్న తీర ప్రాంతం

తోటపల్లిగూడూరు: తుఫాన్ ప్రభావంతో మండలంలోని తీర ప్రాంతం అతలాకుతలమైంది. ఐదురోజులపాటు కురిసిన భారీ వర్షాలతో భారీ నష్టం వాటిల్లింది. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. చెట్లు నేలవాలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఇంకా నారుమడులు వరద ముంపునకు గురికావడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. తుఫాన్ కారణంగా తోటపల్లిగూడూరు మండల కార్యాలయంలో చెట్లు పడిపోయి కార్యాలయం రూపురేఖలు కోల్పోయింది. తీర ప్రాంతంలో అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. చెట్లను పక్కకు తొలగించి రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు. ముంపునకు గురైన నారుమడులను గుర్తించి నష్ట పరిహారం అందించేందుకు వ్యవసాయ శాఖ సన్నద్ధమవుతోంది.

ప్రజా సేవలో..

కోవూరు: లోతట్టు ప్రాంతాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలిచారు. ఆ పార్టీ యువజన విభాగం సభ్యుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి జనరేటర్ తెప్పించారు. దీంతో కోవూరు పంచాయతీ పరిధిలో తాగునీరు ప్రజలకు సజావుగా అందింది. నేతాజీ నగర్‌లో మండల సచివాలయ కన్వీనర్ కవరగిరి ప్రసాద్ వాటర్ ట్యాంకర్‌ను తెప్పించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఇంకా పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు ముల్లవరపు చిరంజీవి తన మిత్రమండలితో కలిసి విఘ్నేశ్వపురం కాలనీ ప్రజలకు భోజనాలు అందజేశారు.

ఇళ్లకు వెళ్లి భోజనం పంపిణీ


జెడ్పీ హైస్కూల్లో..

పొదలకూరు: ఇళ్లలో వంట చేసుకోలేని పరిస్థితి ఉన్న వారికి అధికారులు భోజనం పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన ఏసీ నగర్ కాలనీకి వీఆర్వో శ్రీహరి వెళ్లి పలు కుటుంబాలకు భోజన సదుపాయం కల్పించారు. జెడ్పీ హైస్కూల్, శివాలయం వీధి పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను అధికారులు రెండురోజులపాటు ఏర్పాటు చేశారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భోజన వసతిని కల్పించారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన కుటుంబాల వారు పొదలకూరు పునరావాస కేంద్రంలో తలదాచుకోగా బుధవారం సొంత ఇళ్లకు వెళ్లారు. కాగా కేంద్రాల నుంచి ఇళ్లకు చేరుకున్న వారికి వెంటనే పని దొరకదని వారికి బియ్యం, నిత్యవసర సరుకులను కూడా అందజేస్తున్నట్లు తహసీల్దార్ కె.వీరవసంతరావు వెల్లడించారు.


పొదలకూరు: జేసీబీ యంత్రంతో పనులు చేస్తున్న దృశ్యం


పొదలకూరు: ఇనుకుర్తి వద్ద పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్, సెక్రటరీ


కొడవలూరు: నిత్యావసర సరుకుల పంపిణీ


వెంకటాచలం మండలంలో..


కోవూరు: గిరిజన కాలనీలో భోజనం పెడుతున్న చిరంజీవి

ప్రజలకు అండగా ఉన్నాం

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు: తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు నిలిచి ఆదుకున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జనరేటర్ల ద్వారా ప్రజలకు నీరు అందిస్తున్నారని చెప్పారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి మండలంలో ఎంతమంది రైతులు నార్లు పోశారు?, ఎంతమేర నష్టం వాటిల్లిందని ఆరా తీశారు. మూడురోజులు తీర ప్రాంతంలో గస్తీ నిర్వహించిన తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్సై ఆంజనేయులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ వేనుంబాక భవానమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, రామిరెడ్డి విజయభానురెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, యేనేటి ప్రసాద్, బుచ్చిగారి తిరుపతయ్య, ఆవుల వాసు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం



మాట్లాడుతున్న వెంకటశేషయ్య

వెంకటాచలం: పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని, వారికి సంక్షేమ పథకాలు పక్కాగా అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య అన్నారు. మండలంలోని కురిచెర్లపాడులో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఏ పథకం ద్వారా ఎంత మేరకు లబ్ధి చేకూరిందో చెప్పారు. అనంతరం వెంకటశేషయ్య మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పాలనలో టీడీపీ సానుభూతిపరులకు మాత్రమే లబ్ధి చేకూర్చేవారని తెలియజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముజీబున్నీసా, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణిదెన మోహన్ నాయుడు, సర్పంచ్ అక్బర్‌బాషా, ఎంపీటీసీ ప్రభావతి, నాయకులు వెంకటరమణయ్య, రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు


నరుకూరు సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

తోటపల్లిగూడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు అన్నారు. మండలంలోని నరుకూరు సచివాలయం పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. అందువల్ల మరోసారి జగన్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు చెప్పారు. ప్రజలు మళ్లీ ఆయనకే ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ సర్పంచ్ ఆకుల మధు, ముసలి పరంధామయ్య, ఉడా కిశోర్, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

80 శాతం రాయితీపై విత్తనాలు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి కాకాణి

నెల్లూరు (దర్గామిట్ట): నారుమడులు దెబ్బతిన్న ప్రాంతాల్లో 80 శాతం రాయితీపై విత్తనాలను అందజేయనున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. తుఫాన్ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, తీర ప్రాంతాలకు చెందిన 8,500 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి.. భోజనం, తాగునీరు తదితర సదుపాయాలను కల్పించామని తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ఆ శాఖ అధికారులు ఒత్తిడిలో కూడా బాగా పనిచేశారని తెలిపారు. విద్యుత్ అంతరాయంతో తాగునీటి సరఫరాకు అక్కడక్కడా కొంత ఇబ్బంది ఏర్పడిందని, ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా నష్టాలపై పూర్తిస్థాయిలో అంచనాలను రూపొందించాలని సూచించారు. అంచనాలు పూర్తి స్థాయిలో వచ్చాక రైతులకు సహాయ కార్యక్రమాలను చేపడతామన్నారు. ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుందని వెల్లడించారు. నగరంలో పడిపోయిన 550 చెట్లను 24 గంటల్లో తొలగించి జనజీవనానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టిన కమిషనర్‌ను అభినందించారు.

రాజేంద్రనగర్‌లో చైన్ స్నాచింగ్

నెల్లూరు(క్రైమ్): మహిళ మెడలోని గొలుసును గుర్తుతెలియని దుండగులు తెంపుకెళ్లిన ఘటన కుక్కలగుంటలోని రాజేంద్రనగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాజేంద్రనగర్‌కు చెందిన అనూరాధ తన ఇంటి సమీపంలో చెత్తను వేసేందుకు తెల్లవారుజామున వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు బైక్‌పై వెనుక నుంచి ఆమెను వెంబడించారు. జనసంచారం పెద్దగా లేకపోవడంతో ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. బాధితురాలు కేకలేసినా ప్రయోజనం లభించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజలను వేడుకగా బుధవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా గండవరపు వినోద్‌రెడ్డి, దీప, వంశీకృష్ణారెడ్డి, అర్చన దంపతులు, సునంద వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య,, మోహన్‌రావు, శంకరన్, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సామగ్రి అందజేత



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని సీఆర్పీ డొంకలో గల మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వద్ద నిత్యావసర సరుకులను దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్తలు జగన్నాథం, పద్మజ దంపతులు బుధవారం అందజేశారు. తుఫాన్ కారణంగా ఇబ్బంది పడుతున్న 500 కుటుంబాలకు వీటిని అందజేశామని చెప్పారు.

సీపీఆర్‌పై అవగాహన



నెల్లూరు సిటీ: నగరంలోని ఏసీఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఎన్టీఆర్‌ఎమ్మెస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వసుంధర, జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్, అనస్థీషియా విభాగాధికారి శ్రీనివాసరావు, ప్రొఫెసర్ జమున, కో-ఆర్డినేటర్ సురేష్, శారద, రమ్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి


వెంకటాచలం : బాబాసాహెబ్‌కు నివాళులర్పించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో బుధవారం బాబాసాహెబ్ విగ్రహానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ కృషి చేశారని కొనియాడారు. ఆయన రచించిన భారత రాజ్యాంగం వల్ల ఎంతోమంది పేదలకు న్యాయం జరిగిందన్నారు. బాబాసాహెబ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, జిల్లా నాయకులు పెళ్లూరు సుధాకర్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, సర్పంచ్ అడపాల ఏడుకొండలు, ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కొడవలూరు: మండలంలోని గుండాలమ్మపాళెంలో అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమం జరిగింది. బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాసులు, సభ్యులు దొడ్ల వెంకటరమణయ్య, కాకాని శ్రీధర్, పానేటి శ్రీనివాసులు, కట్టా మాధవయ్య, పి.వెంకటేశ్వర్లు, పర్వతాల శ్రీనివాసులు, పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. గౌతమ్‌నగర్‌లో సర్పంచ్ నాగిరెడ్డి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి దళిత నేతలు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు ఎల్లు జనార్దన్, ఎన్.జయదేవ్, జి.విజయకుమార్, చిన్నయ్య, తిరుపాలు, చెన్నయ్య పాల్గొన్నారు.


కొడవలూరు మండలం గుండాలమ్మపాళెంలో..


కొడవలూరు మండలం గౌతమ్‌నగర్‌లో

గ్రామాల్లో పంటల పరిశీలన


ఆలూరుపాడులో పరిశీలిస్తున్న ఏఓ

కొడవలూరు: మండలంలోని ఆలూరుపాడు, రామన్నపాళెం, మానేగుంటపాడు తదితర గ్రామాల్లో బుధవారం ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి పర్యటించారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట నష్టాలను అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నివేదికను గురువారానికి పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఆమె వెంట వీఏఏలు ఆర్.నిహారిక, కేవీ పృథ్వీలు ఉన్నారు.